విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత

నేరేడుచర్ల, జూన్ 24 : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షులు కొమర్రాజు లక్ష్మయ్య తండ్రి కొమర్రాజు రత్నం వర్ధంతి సందర్భంగా బోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

నిరుపేదలకు అల్పాహారం పంపిణీ

నేరేడుచర్ల, జూన్ 24 : నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు చావా వీరభద్రరావు జన్మదినం సందర్భంగా పట్టణం లోని 300 మంది నిరుపేదలకు మంగళవారం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

సంత ఏర్పాటుకు స్థల పరిశీలన

మఠంపల్లి,జూన్ 24 : మఠంపల్లి సబ్‌మార్కెట్ యార్డులో సంత ఏర్పాటు చేసేందుకు మంగళవారం హైద్రాబాద్ నుండి డీఈ రవీందర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ వర్క్ ఇన్స్‌పెక్టర్ డి.సుదర్శన్‌రెడ్డిలు మంగళవారం స్థల పరిశీలన చేశారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచనలతో సంత ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, యార్డు సెక్రటరీ రఘుపతి రెడ్డి తదితరులున్నారు.

సామాజిక భద్రతకు
జాతీయ కుటుంబ లాభాల పథకం

గరిడేపల్లి, జూన్ 24 : జాతీయ కుటుంబ లాభాల పథకం లబ్దిదారులకు సమాజిక భద్రత కల్పిస్తుందని మండల తహశీల్దార్ బండ కవిత తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కుటుంబంలో ప్రధాన ఆధాయ వృద్దిని కోల్పోయిన పేద కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 18 నుండి 59సంవత్సరాల మద్య వయస్సులో మరణించిన కుటుంబ సభ్యులకు ఆర్థి భరోసా కల్పించడమే ఈ పథకంలో లక్ష్యమని, బీపీఎల్ కార్డుతో పాటు అవసరమైన దృవీకరణల పత్రాలతో రెండు సంవత్సరాల వ్యవదిలో ధరకాస్తు చేసుకోవాలన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీధిలైట్లు బహూకరించిన బీఆర్ఎస్ నాయకుడు

ఎల్ఈడీ బల్బులు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అప్పారావు

కోదాడ రూరల్, జూన్24 : మండల పరిధి కాపుగల్లు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దొంతగాని అప్పారావు గ్రామానికి 1లక్ష రుపాయాల విలువ గల 100 ఎల్ఈడీ వీధిలైట్లు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పల్లెలు పట్టణాలకు ధీటుగా అభివృద్ధి సాధించాయని, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని అన్నారు. ఇప్పటికైన పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించి త్వరలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా బోసుబాబు, గోపి, కాసాని గోపి, శ్రీను, వెంకటనారాయణ, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, నరేష్, సీతరాములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి,జూన్ 24 : మండలంలోని ఎల్బీనగర్ గ్రామ పంచాయితీ సమీపంలో కోదాడ –మిర్యాలగూడ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దూపాడు గ్రామానికి చెందిన శ్రీనివాస్ ,రవీందర్ మిర్యాలగూడ మండలం అవంతిపురం సంతకు వెళ్ళి మేకను కొనుక్కొని బైక్‌పై తిరిగి వస్తుండగా ఎల్బీనగర్ సమీపంలో మేక ఒకసారి ఎగిరి పడడంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రోడ్డుపై ఇరువురు కింద పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనాయి. గ్రామస్తులు సహకారంతో 108వాహనంలో హుజూర్ నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నాడు వెలుగులు ... నేడు చీకట్లు

అంధకారంలో జాతీయ రహదారి

చీకట్లలో పెరుగుతున్న ప్రమాదాలు

మరమ్మతులు చేపట్టాలంటున్న ప్రజలు

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సెంట్రల్ లైటింగ్ వెలుగులు

నేడు చిమ్మచీకట్లలో జాతీయ రాహదారి

నేరేడుచర్ల, జూన్ 24 : నేరేడుచర్ల పట్టణంలోని భద్రాచలం–జడ్చర్ల జాతీయ రహదారిపైన ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సక్రమంగా వెలగకపోవడంతో రహదారి మొత్తం చిమ్మచీకట్లను అలుముకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ అమర్చి ప్రతి స్తంభానికి కలర్.. కలర్ రిబ్బన్ లైటింగ్‌ను ఏర్పాటు చేసి కొత్త అందాలు తీసుకు వచ్చింది. కాని ప్రస్తుతం అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా రోజుల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని మిర్యాలగూడ రోడ్డువైపు సెంట్రల్ లైట్లు వెలగక రహదారి మొత్తం చీమ్మ చీకటిగా కనిపిస్తుంది. విద్యుత్ నిర్వహణ బాధ్యత జాతీయ రహదారి గుత్తేదారులదే అయినప్పటికీ వారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయి దీర్ఘకాలం అవుతున్నప్పటికీ స్థానిక ప్రధాన కూడలి వద్ద ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేయ్యలేదు. దీంతో రాత్రి సమయంలో వాహన చోదకులకు సక్రమంగా కనిపించక డివైడర్లను ఢీ కొట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా విద్యుత్ కాంతులు లేకపోవడంతో సెంటర్‌లో పశువులు, మేకలు రోడ్లపైన పండుకుంటున్నాయి. అవి కనిపించక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జాతీయ రహదారి ఉన్న తాధికారులు జోక్యం చేసుకొని స్థానిక ప్రధాన కూడలి వద్ద ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేయడంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపైన ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ మొత్తం వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మార్పు కోసమే జరిమాన..తప్పల నుంచి పాఠాలు..

ఎస్పీ నరసింహ

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ, హాజరైన ఆటో డ్రైవర్లు

సూర్యాపేటటౌన్, జూన్ 24 : చట్టాలు ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేయబడ్డాయని జరిమాన విధించడం అనేది మనలో మార్పు కోసమేనని తప్పుల నుంచి పాఠాలు నేర్చుకొని జాగ్రత్తగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. మంగళవారం స్థానిక పబ్లిక్‌క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, డ్రగ్స్ నిర్మూళన, డ్రగ్స్ విని యోగం వల్ల జరిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్‌రెడ్డితో కలసి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని, ఆటో డ్రైవర్ల వాహనాలు కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు లైసెన్స్, వాహనపత్రాలు కలిగి ఉండాలని నిబంధనల ప్రకారం డ్రైవర్ దుస్తులు ధరించి వాహనాలు నడుపాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్ళేప్పుడు వారితో మర్యాదగా ఉండాలన్నారు. ఆటోలో అక్రమ రవాణా చేయవద్దని రోడ్డు భద్రత ప్రమాదాల నివారణలో పోలీసులతో భాగస్వామ్యం కావాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల జరిగే మంచి, చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల మత్తులో ఘోరమైన నేరాలకు కూడా వెనుకాడడం లేదని తెలిపారు. ఇలాంటి మాదక ద్రవ్యాలు మత్తు నుంచి మన సమాజాన్ని మన పిల్లలను మనం రక్షించుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలు వద్దు మంచి జీవితం ముద్దు అంటూ అవగాహన కల్పించి ఇలాంటివి వినియోగించినా, రవాణా చేసినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం యాంటీ డ్రగ్స్ సోల్జర్ ప్లెడ్జీతో ఆటో డ్రైవర్లతో కలసి ఎస్పీ, ఆర్డీఓ, సెల్ఫీ ఫోటోలు దిగారు. అవగాహన కార్యక్రమాన్ని ఏర్పా టు చేసిన పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఎస్ఐ ఆంజనేయులును ఎస్పీ అభినందించారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి

అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల, జూన్ 24: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరిచేరవని, సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని నేరేడుచర్ల మున్సిపల్ కమీషనర్ యడవల్లి అశోక్ రెడ్డి అన్నారు. 100 రోజుల ప్రణాలిక కార్యక్రమంలో భాగంగా 23వ రోజు మంగళవారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో తడి చెత్త– పొడ్డి చెత్త వేరుచేసే విధానం, ఎరువు తయారీ, డెంగ్యూ, మలేరియాపై అవగాహాన కల్పిస్తూ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే ఆదర్శ మున్సీపాలిటీ తీర్చిదిద్దుకోవచ్చన్నారు. అనంతరం మురుగు కాల్వలలో పూడిక తీయించి దోమలు వృద్ధి చెందకుండా మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించారు. నిరుపేద మహిళలను గుర్తించి సమ భావన సంఘాలు, వీధి వ్యాపారుల సీఐజి గ్రూపులుగా ఏర్పాటు చేయుటకు మెప్మా, ఆర్పీలు సర్వే నిర్వహించారు. వాటర్ ట్యాంకుల ద్వార సరఫరా చేసే నీటిని క్లోరిన్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, వార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమభావన సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

బండమీది చందుపట్లను
సందర్శించిన డీపీవో యాదగిరి

చివ్వెంల,జూన్ 24 : మండల పరిధిలోని బండమీది చందుపట్లను జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి మంగళవారం సందర్శించారు.ఇటీవల ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాధు మేరకు గ్రామంలోని ఊర చెర్వులో తామర పూవ్వులను ఏటువంటి సమాచారం ఇవ్వకుండా విక్రయ హక్కును ఒక వ్యక్తికి అప్పగించిన విషయం పై విచారణ చేపట్టారు.విచారణ అనంతరం మరో ఐదు రోజుల్లో నివేధికను జిల్లా కలెక్టర్ కు అదజేయనున్నట్లు ఆయన తెలిపారు.నివేధిక అనంతరం జిల్లా కలెక్టర్ సూచనల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.మండలంలో పెద్ద గ్రామ పంచాయితీ అయిన మా గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటువంటి నిధులు లేక పోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నామని తామర పువ్వులు బహిరంగ వేళం వేస్తే సుమారు రూ 2 లక్షల వరకు వేలం పాట పాడే అవకాపం ఉన్నా అతి తక్కువ ధరకు పంచాయితీ కార్యదర్శి ఇచ్చారని డిపీఓకు ఫిర్యాదు దారులు వివరించారు.యన వెంట సీసీ కృష్ణ,పంచాయితీ కార్యదర్శి మల్లయ్య,సిబ్బంది ఉన్నారు.

ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

గరిడేపల్లి, జూన్ 24 : మండల పరిధిలొని పొనుగోడు గ్రామ ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జిల్లా అద్యక్షులు చింత వినయ్‌బాబు మాదిగ, ఏపూరి రాజు మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామ అద్యక్షుడిగా కుర్రి శివ,ఉపాద్యక్షుడిగా కత్తి గురవయ్య, చిలక సందీప్, అప్పికట్ల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా నందిపాటి రమేష్, సహాయ కార్యదర్శిగా మామిడి రాజు, రాం ప్రశాంత్, నందిపాటి సైదులు ,కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్యవాద దాడులకు
నిరసనగా ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

సూర్యాపేటటౌన్, జూన్ 24 : గత రెండు మూడు రోజులుగా ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్‌కు అండదండగా సాగిస్తున్న భయంకరమైన యుద్ధ దాడులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు పేర్ల నాగయ్యలు అన్నారు. మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఇరాన్‌పై అమెరికా దాడులను నిరసిస్తూ స్థానిక వాణిజ్యభవన్ సెంటర్‌లో నిరసన వ్యక్తంచేసి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఐరా స, భద్రత మండలిని ధిక్కరించి అమెరికా చేస్తున్న దాడులను భారత ప్రభుత్వం ధృఢంగా వ్యతిరేకించాలన్నారు.

నూతన్‌కల్‌లో..

నూతనకల్, జూన్ 24 : గత రెండు మూడు రోజులుగా ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్‌కు అండదండగా సాగిస్తున్న భయంకరమైన యుద్ధ దాడులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీపీఎం పార్టీ నూతనకల్ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ యొక్క అనైతిక రెచ్చగొట్టే విధానం ద్వారా మొత్తం ఆసియా ఖండాన్ని యుద్ధ మంటల్లోకి నెట్టడమే కాకుండా ఈ యుద్ధోన్మాద చర్య ప్రపంచ శాంతికి కూడా విఘాతం కలిగిస్తుందని అన్నారు. ప్రపంచ శాంతి కాముకులందరిని ఏకం చేసి అమెరికా యుధ్ధోన్మాదాన్ని నివారించాలని వామపక్ష పార్టీలు కోరుతున్నాయన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి
దాతల సహకారం అభినందనీయం

నగదు బహుమతులు అందిస్తున్న ఆర్డీవో సూర్యానారయణ, పాండురంగారావు

కోదాడ రూరల్, జూన్24 : ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీమని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్డీవో సూర్యానారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధి కాపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 – 2025 విద్యా సంవత్సరంలో పదివార్షిక ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చాటిని నాలుగురు విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు తన తల్లిదండ్రులు ముత్తవరపు సుబ్బారావు, లక్ష్మల జ్ఞాపకార్థం నగదు బహుమతులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు ఆర్డీవోను శాలువతో సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ముత్తవరపు రామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నల్లూరి రవి, నంబూరి లక్ష్మయ్య, వెంకటేశ్వరావు, వీరపునేని కొండయ్య, జిల్లెపల్లి శ్రీనివాస్, బడిశ నరసింహారావు, హనుమంతరావు, అన్నబత్తుల రామయ్య, సుబ్బారావు, కాసాని వీరయ్య, బాలేబోయిన సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

కోదాడ రూరల్, జూన్24 : మండల పరిధి గుడిబండ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఇర్ల వరమ్మ(104) (మిల్లు వరమ్మ) మంగళవారం మృతి చెందిన్నట్లు బంధవులు తెలిపారు. మృతురాలి భర్త నరసింహారెడ్డి గత 50 సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మనువడు పెద్దాబాయి నరసింహారెడ్డి వద్దనే ఉంటుంది. గ్రామానికి చెందిన పెద్దలు, బంధువులు ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళ్లార్పించారు.

నాన్న వెంటే సర్కారు బడికి..

పెన్‌పహాడ్, జూన్ 24 : పెన్‌పహాడ్ మండలంలోని చెట్ల ముకుందాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న వేల్పుల జాకోబు రాజకుమార్ తన కుమార్తె ఎలిజబెత్ అమూల్యను తాను పని చేస్తున్న పాఠశాలలోనే 3వ తరగతిలో చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు. మా పిల్లలను పని చేస్తున్న బడిలోనే చేర్పించడం వల్ల గ్రామస్తులకు నమ్మకం పెరిగి వారి పిల్లలను కూడా చేర్పిస్తున్నారని రాజ్ కుమార్ అన్నారు. ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని, పాఠశాల బలోపేతానికి ఇది ఒక మంచి మార్గమన్నారు.

రైతులతో సీఎం ముఖా ముఖి

ఆత్మకూర్.ఎస్, జూన్ 24 : మండల పరిధిలోని ఏపూరు, తుమ్మల పెన్‌పహాడ్ రైతు వేదికల్లో రైతు భరోసా సంబురాల్లో భాగంగా మండలంలోని రైతులకు వానాకాలం 2025 సంవత్సరానికి రైతు భరోసా నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రైతులతో ముఖా ముఖి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ద్వారా అనుసంధానం చేశారు. మొత్తం 17,897మంది రైతులకుగాను ప్రస్తుతం 16,361 మందికి 22.88 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమా అయ్యాయి.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

సూర్యాపేటటౌన్, జూన్ 24 : జిల్లా కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం ద్వార తోరణ ధ్వజం, కుంభ ఆరాధనలు, శార్దూల వాహన సేవ, మహా పూర్ణాహుతి, చక్రస్నానము వసంతోత్సవాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో పుష్పయాగం నిర్వహించి దేవాతామూర్తులను ఊరేగించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

జాజిరెడ్డిగూడెంలో అవగాహన కల్పిస్తున్న కళాబృందం

అర్వపల్లి, జూన్ 24 : ప్రభుత్వ పథకాలపై జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాబృందంచే మంగళవారం జాజిరెడ్డిగూడెంలో ప్రజలకు ఆట పాట ద్వారా అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, బడిబాట, ప్రభుత్వ పాఠశాలలో విద్య విధానం వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, భూ భారతి చట్టం తదితర కార్యక్రమాలపై ప్రజలకు తెలియజేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నూతనకల్, జూన్ 24 : నకిలీ వత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఫెర్టిలైజర్ షాపుల యజమానులు, రైతులకు నకిలీ ఎరువులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు రిజిస్టర్లు, యూరియా డిఏపి తదితర పురుగుల మందుల స్టాకులను సీడ్స్ డీలర్స్‌గా పక్కాగా మెయింటైన్ చేయాలని ఆయన అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి మురళిబాబు, ఫెర్టిలైజర్ షాప్ యజమానులు తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్స్ దాతలకు అభినందనలు

అర్వపల్లి, జూన్ 24 : విద్యార్థులకు నోట్స్‌బుక్స్ అందించేందుకు దాతలు మందుకు రావడం అభినందనీయం అని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉల్లేందుల సైదులు అన్నారు. మంగళవారం అదే గ్రామానికి చెందిన నున్న నిఖిల్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు యాదగిరి శైలజ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు బ్యాగ్‌లు, పెన్నులు, నోట్స్ అందజేశారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

ఘనంగా రైతు భరోసా సంబురాలు

మఠంపల్లి, జూన్ 24 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా సంబురాలు మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హుజూర్‌నగర్ వ్యవసాయ డివిజనల్ అధికారి ఏడీఏ రవినాయక్, ఏవో శ్రీనివాస్, ఏఈవోలు పాల్గొన్నారు.

మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తున్న బీజేపీ

డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్

శిక్షణ శిబిరంలో అభివాదం చేస్తున్న డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్సీలు

సూర్యాపేటటౌన్, జూన్ 24 : బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దేశంలో మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల అణిచివేతకు పాల్పడుతున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రాంమచంద్రనాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సహకారంతో మాజీ ఎంపీపీ దారావత్ వీరన్ననాయక్ అధ్యక్షతన మూడు రోజుల పాటు జరగనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా బునియాది కార్యకర్తల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల మద్య చిచ్చు పెట్టి విభజించే విధానాన్ని అవలంభిస్తున్నాయని అన్నారు. ఆదివాసీల భూములను వారికే అప్పగించేలా కాంగ్రెస్ పార్టీ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఆదివాసి బంజరా బిడ్డలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను తెలుసుకోవాలని, అందు కోసమే శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి ఇప్పటికే ఐదు జిల్లాల్లో ఈ శిక్షణ పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
1. APE AUTO BS VI - 2022, TS29TB2503,
2. APE CITY DIESEL BS6- PH2-2024 TG05T6632
Cell No. 7337351819
D No.797, 1st Floor, Bharath Reddy Complex, Opp: MRO Office, Main Road, Kodad-508206

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ: 9182777625, 9182777635		దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059	సూర్యాపేట: 9182777630	భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059	కోదాడ: 9182777630	చౌటుప్పల్: 9182777638